ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శుక్రవారం 2 ఫిబ్రవరి 2024




నేతన్నలకు మళ్లీ నిరాశే

- వేతన జీవుల్లోనూ అసంతృప్తి
- ఆశా, అంగన్‌వాడీలకు ఆరోగ్య బీమా పథకం
- మహిళలకు లక్‌పతి దీదీ పథకం
- పేదలకు సొంతింటి కలపై ఆశలు
- కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో పెద్దగా మార్పులు లేకపోగా ఎన్నికల యేడాదిలో ఊరటను ఇస్తుందని భావించినా సిరిసిల్ల నేతన్నలకు నిర్మలమ్మ బడ్జెట్ నిరాశ పర్చింది. గురువారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అందని ద్రాక్షగానే మారింది. 2013 కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచి సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నా ప్రతీ కేంద్ర బడ్జెట్‌లో సిరిసిల్లను చిన్నబుచ్చుతోంది. ప్రతీ బడ్జెట్ సమయంలో సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ ఇవ్వాలని నేతలు కోరడం బడ్జెట్ సమయంలో కేటాయింపులు లభిస్తాయని ఆశగా ఎదురు చూడడం జరుగుతూనే వస్తోంది. 2018, 2019, 2020, 2021, 2022, 2023 బడ్జెట్‌లో చివరి వరకు మెగా పవర్‌లూం క్లస్టర్ వస్తుందని ఆశించినా ఇతర ప్రాంతాలకు మంజూరు ఇచ్చారు. ఈ సారి ఓట్ ఆన్ బడ్జెట్ కావడంతో పెద్దగా ఆశలు లేకపోయినా ఎన్నికల దృష్ట్యా నేతన్నలకు సంతృప్తికరమైన ప్రకటన వస్తుందని భావించారు. కానీ ఈసారి కూడా నేతన్నలకు బడ్జెట్ సారీ చెప్పిందని భావిస్తున్నారు.



మహిళల్లో ఆసక్తి

సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో ముందుకు వెళుతున్నామన్న క్రమంలో బడ్జెట్‌లో మహిళలు, రైతులు, యువతను ఎక్కువగా దృష్టిలో పెట్టుకున్నారని భావిస్తున్నారు. దేశ వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల్లో ఉన్నా మహిళలకు ఆర్థిక చేయూతను ఇచ్చే దిశగా దాదాపు కోటి మంది మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడంతో లక్‌పతి దీదీ పథకం మహిళలను లక్షాధికారిగా మారడానికి ఈ పథకం దోహదపడిందని ప్రకటించారు. ఈ లక్ష్యాన్ని 2 కోట్ల నుంచి 3 కోట్ల మంది మహిళలకు పెంచారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 9,962 స్వశక్తి సంఘాలు ఉండగా 1.24 లక్షల మంది మహిళ సభ్యులు ఉన్నారు. వీరికి శిక్షణ నైపుణ్యాల్లో ఉపయోగపడనున్నాయి.

అంగన్‌వాడీ ఆశావర్కర్లకు ఆయుష్మాన్‌భారత్ పథకం కింద ఆరోగ్య బీమా కవరేజీని ఐదు లక్షల రూపాయల వరకు అందించే విధంగా ప్రకటించారు. తొమ్మిది నుంచి 14 ఏళ్లలో మధ్యలో ఉన్న బాలికల్లో సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించేందుకు వ్యాక్సినేషన్ ప్రోత్సహించనున్నట్లు ప్రకటించారు.

మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగేనా...

మురికి వాడలు, అద్దె ఇల్లలో ఉండే మధ్య తరగతి ప్రజల కోసం కొత్త పథకాన్ని తీసుకువస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. సొంత ఇంటిని నిర్మించుకునే విధంగా పథకం ఉండబోతుందని బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా వచ్చే ఐదేళ్లలో మరో రెండు కోట్ల ఇళ్ల నిర్మాణాలకు పూనుకోనున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు రూఫ్, టాప్ సోలరైజేషన్ ద్వారా కోటి గృహాలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించనున్నారు.

వేతన జీవులకు నిరాశే...

వేతన జీవులకు, పన్నుల చెల్లింపుదారులకు కేంద్ర బడ్జెట్ నిరాశనే మిగిల్చింది. పన్ను విధానాల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. కొత్త పన్ను విధానం తీసుకువస్తుందని, రిబేట్, ట్యాక్స్, బెనిఫిట్స్ లభిస్తుందని భావించినా నిర్మలా సీతారామన్ పన్నులను దేశాభివృద్ధికి ఉపయోగపడుతుందని ట్యాక్స్ పేయర్లకు ధన్యవాదాలు మాత్రమే తెలిపారు.

గత బడ్జెట్ ఐదు లక్షల నుంచి ఏడు లక్షలకు పెంచిన పన్ను రిబేట్‌ను ఈ సారి మరింత పెంచుతుందని భావించినా నిరాశ పడ్డా రు. సెక్షన్ 80సీ కింద పన్నుల ప్రయోజనాలను రూ 1.50 లక్షల నుంచి రెట్టింపు చేస్తారనుకున్నా రు. పన్ను స్లాబుల్లో మార్పులు వస్తాయని భావించినా నిరాశ పడ్డారు. రైతులకు ఎరువులు విషయంలోనూ నానో యూరియా, అందుబాటులోకి రావడంతో మరింత ప్రోత్సహించే విధంగా భావించారు. నానో యూరియాపై అవగాహన పెంచడానికి ప్రోత్సా హం అందిస్తున్న క్రమంలో బడ్జెట్‌లో కోత కనిపిస్తుంది. ఈసారి మధ్యంతర బడ్జెట్ కావడంతో కేటాయింపులు, వడ్డనలు లేకపోవడంతో బడ్జెట్‌పై చర్చలే లేకుండా పోయింది.

సిరిసిల్లలో కొన్ని సంవత్సరాల నుంచి వస్త్ర పరిశ్రమ సంక్షోభం వలన సరైన ఉపాధిలేక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ బడ్జెట్‌లో సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ కేటాయిస్తారని ఎంతో ఆశతో ఎదురుస్తున్న కార్మికవర్గానికి నిరాశనే మిగిల్చింది.

పనులు చెప్పుకోవడానికి మాత్ర మే ఉపయోగపడింది. ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద వడ్డీ రేటు తగ్గించడం జరిగింది. ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిస్తు, ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించేలా బడ్జెట్ ఉంది. వేతన జీవులకు ఎలాంటి అదనపు ప్రయోజనం కలుగలేదు.

యోజన పథకం కింద నిర్మించే ఇళ్ల వేముల వాడ మండలంలోని మధ్యమానేరు నిర్వాసితులు ఇళ్ల కట్టుకునేందుకు ఎంతగానో దోహదపడుతుంది.

బీజేపీ ఎన్నికల బడ్జెట్
గుంటి వేణు, సీపీఐ జిల్లా కార్యదర్శి



ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ ప్రవేశపెట్టినది రానున్న పార్లమెంట్ ఎన్నికల బీజేపీ బడ్జెట్. మధ్య ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకే ప్రాధాన్యమిస్తూ బడ్జెట్‌ను కేటాయించారు. ఆర్థిక వ్యాపార దిగ్గజాలు అదాని అంబానీల మెప్పు పొందే బడ్జెట్‌గా ఉంది. దేశ వ్యాప్తంగా రెండు కోట్ల మంది పేదలు ఇళ్ల నిర్మించుకోవడానికి మాత్రమే బడ్జెట్ కేటాయించారు. పేదలకు ఉపయోగపడే విద్యా, వైద్యానికి నిధులు కేటాయించలేదు. రైతాంగానికి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది.

తెలంగాణకు మొండి చేయి
కాముని వనిత, కాంగ్రెస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి రాష్ట్రానికి మొండి చేయి చూపింది. బీజేపీ పాలిత రాష్ట్రాలకే బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మీదుగ వెళ్లే రైల్వే లైన్ ఏర్పాటుకు బడ్జెట్‌ను కేటా యించలేదు. కార్మిక క్షేత్రమైన సిరిసిల్లను ఆదుకోవ డం కోసం బడ్జెట్‌లో నిధులను కేటాయించలేదు. ఉపాధి పథకంపై దాదాపు 20 కోట్ల మంది కూలీలు పనిచేస్తున్నారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. కేంద్ర బడ్జెట్ ఆశాజనకంగా లేదు.

బడ్జెట్‌లో పెద్ద మార్పు ఏం లేదు
తోట ఆగయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు



లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ఎన్నికల బడ్జెట్‌ను తలపించింది. కొత్తగా ఏ రంగాలకు ప్రత్యేక నిధులు కేటాయించలేదు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిలా ఉంటుందనుకున్న కేంద్ర బడ్జెట్ నిరాశే మిగిల్చింది. బడ్జెట్‌లో పెద్ద మార్పు ఏం లేదు.

పేదలకు ఉపయోగపడని బడ్జెట్
నాగుల సత్యనారాయణ, పీసీసీ రాష్ట్ర కమిటీ సభ్యులు



కేంద్ర బడ్జెట్ కంటి తుడుపుగానే ఉంది. పేదలకు ఉపయోగపడే విధంగా లేదు. మధ్యంతర బడ్జెట్ పేరుతో అంకెల గారడీ మిగిలించారు. సిరిసిల్ల నేతన్నలు ఎదురు చూస్తున్న మెగా పవర్‌లూం క్లస్టర్ ఆశలు తీర్చలేకపోయింది. వేతన జీవులకు నిరాశ కలిగించింది. తెలంగాణను పూర్తిగా విస్మరించింది.

టెక్స్‌టైల్ రంగానికి నిరాశ
కోడం రమణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి



కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ పార్ల మెంట్‌లో ప్రవేశపెట్టిన 2024 కేంద్ర బడ్జెట్‌లో దేశం లో వ్యవసాయం తర్వాత లక్షలాదిమంది ఉపాధిని పొందుతున్న టెక్స్‌టైల్ రంగానికి నిరాశనే మిగిలింది. తెలంగాణ రాష్ట్రంలోనే వస్త్ర పరిశ్రమకు పేరుగాంచిన

ఆశాజనకంగా కేంద్ర బడ్జెట్
రెడ్డబోయిన గోపీ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా ఉంది. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా ఈ బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ రూపొందించారు. ఈ బడ్జెట్‌లో ట్యాక్స్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని ప్రకటించడంతోపాటు అన్నిరంగాలకు అనుగుణంగా బడ్జెట్‌ను రూపొందించారు.

విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయింపు
దోర్నాల భూపాల్ రెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు



కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్ విద్యారంగానికి మొత్తం బడ్జెట్‌లో 2.61 శాతం మాత్రమే నిధులు కేటాయించడం విద్యభివృద్ధికి దోహదం చేయదు. కేవలం నినాదాలు, ఉపన్యాసాలతో ప్రమాణాలతో విద్యను అందించలేము, నిధుల కొరతతో కొత్త విద్య సంస్థలను స్థాపించి మరిన్ని విద్యావకాశాలను అందుబాటులోనికి తేవడం సాధ్యంకాదు. సగటు వేతన జీవులకు ఆదాయపు పన్ను పరిమితులు పెంచక పోవడం నిరాశ కలిగిస్తుంది.

అన్నివర్గాల ప్రజలను నిరాశపర్చిన బడ్జెట్
సిద్దం వేణు, జడ్పీవైస్ చైర్మన్



కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన ఓట్‌ఆన్‌అకౌంట్ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను నిరాశ పర్చింది. వ్యవసాయరంగానికి కేటాయింపులు తక్కువగా ఉండ టంతో పాటు వాస్తవ పరిస్థితులకు బడ్జెట్ దూరంగా ఉంది. తాము చేసిన

వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు పనిచేస్తుంది
అల్లాడి రమేష్, సెస్ మాజీ చైర్మన్



2047 నాటికి భారతదేశం వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్ర బడ్జెట్ పనిచేస్తుంది. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ భావనను బలోపేతం చేసేందుకు బడ్జెట్ ప్రవేశపెట్టారు. పది సంవత్సరాల కాలంలో ఆర్థిక వ్యవస్థ చాలా అభివృద్ధి చెందింది. రైతుల సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్ ప్రవేశపెట్టారు.

సామాన్యులకు లబ్ధి చేకూరని బడ్జెట్
నులుగొండ శ్రీనివాస్, టైలర్



సామాన్య ప్రజలకు లబ్ధి చేకూరని బడ్జెట్. జీఎస్టీ తగ్గించలేదు. పెట్రోల్, డీజిల్ ధరల్లో మార్పు లేదు. ప్రతీ బడ్జెట్‌లో పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపిస్తోంది. అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా బడ్జెట్ ఉండాలి.

ఇళ్లు లేని నిరుపేదలకు వరంగా బడ్జెట్
బుర్ర లహరిక, సంకెపల్లి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరుపేదల కు ఎంతో వరంగా మారింది. వచ్చే ఐదు సంవత్సరా ల్లో ఇళ్లు లేని నిరుపేదలకు రెండు కోట్ల ఇళ్లను నిర్మా ణం చేపడతామని దానికి సంబందించిన బడ్జెట్‌ను ప్రకటించడంతో పేదల పక్షపాతిగా నిలిచింది. పీఎం ఆవాస్

కొంత ఆశ.. మరికొంత నిరాశ
నేవూరి మమతారెడ్డి, మాజీ సర్పంచ్, ఎల్లారెడ్డిపేట



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్ కొంత ఆశ కల్గించినా మరికొన్ని వర్గాలకు నిరాశే మిగిల్చింది. ఆదాయ పన్నులో ఎలాంటి మార్పు ప్రకటించకపోవడంతో వేతన జీవులకు ఊరట కల్పించింది. రైతులకు ఎరువులు, పాడి రైతులకు ప్రోత్సాహకం, ఇళ్లు లేని పేదలకు ఇళ్లతో పాటు సోలార్ రూఫ్ ఏర్పాటుతో కరెంటు ఆదా కల్పించేందుకు నిధులు లాంటివి బడ్జెట్‌లో కేటాయించడం సంతోషం. ప్రతీ వస్తువుపై జీఎస్టీ చెల్లింపు విషయంలో తగ్గించే నిర్ణయం తీసుకోకపోవడం వల్ల సామాన్యులకు భారం పడనుంది.

జనరంజక బడ్జెట్
ఎన్ దేవేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి



లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్ జనరంజక బడ్జెట్. అన్ని వర్గాలు, గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసింది. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను దృష్టిలో పెట్టుకుని విధివిధానాలను ప్రకటించడం శుభపరిణామం.

వేతన జీవులకు నిరాశే
పాకాల శంకర్‌గౌడ్ టీఎస్‌యూటీఎఫ్, జిల్లా అధ్యక్షుడు



రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఆదాయపు పన్ను పరిమితిని ఈసారైన పెంచుతారని వేతన జీవులు ఆశించారు. ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలని ఏళ్లగా వేతన జీవులు డిమాండ్ చేస్తున్నారు. ఆదాయపు పన్ను స్లాబ్‌లు యథాతథంగా ఉంచుతున్నట్లు ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ప్రకటించడం వేతన జీవుల్లో నిరాశనే మిగిలిపోయింది.

పేద, సామాన్య ప్రజలకు అనుకూలమైన బడ్జెట్
ప్రతాప రామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ పేద, సామాన్య ప్రజలకు అనుకూలమైనది. కోటి మంది పేదలకు ఉచితంగా సౌర విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని బడ్జెట్‌లో హామీ ఇచ్చారు. వచ్చే సంవ త్సర కాలంలో దాదాపు రెండు కోట్ల ఇళ్లను పేద ప్రజల కోసం ఉచితంగా నిర్మించి ఇస్తామని బడ్జెట్లో పొందుపరిచారు. వచ్చే ఐదేళ్ల కాలం పాటు పేదలకు ఉచిత రేషన్ బియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడం హర్షణీయమం. ఎన్నికలను దృష్టిలో పెటుకుని కాకుండా సామాన్య పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన బడ్జెట్ ఇది. బడ్జెట్‌తో పేదలకు ఎంతో మేలు జరుగుతుంది.

- వేములవాడ

బాలుర వసతి గృహం ప్రారంభం



ఎస్సీ బాలుర వసతి భవనాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

కోనరావుపేట, ఫిబ్రవరి 1 : మండలంలోని దర్మారం గ్రామంలో నూతన ఎస్సీ బాలుర వసతి గృహాన్ని జడ్పీచైర్‌పర్సన్ అరుణారాఘవరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో బడుగు బలహీనవర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య గౌడ్, సర్పంచ్ గున్నాల అరుణాలక్ష్మణ్, కోనరావుపేట సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య, గోపి రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు ప్రత్యేక అధికారులు

చందుర్తి, ఫిబ్రవరి 1: గ్రామ సర్పంచుల పదవీకాలం గురువారంతో పూర్తి అయ్యింది. ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించే అవకాశం లేని కారణంగా గ్రామ పాలన బాధ్యతలను ప్రత్యేక అధికారులు చేపట్టనున్నారు. సర్పంచుల పదవీ కాలం ముగిసినందున ప్రభుత్వం ప్రత్యేక అధికారులను గ్రామాల వారీగా నియమించింది. చందుర్తి, రామన్నపేటకు పి రవీందర్ (ఎంపీడీవో), తిమ్మాపూర్ ఐ శాంతయ్య (డీఈ), బండపల్లి, కిష్టంపేటకు సీహెచ్ శ్రీనివాస్ (తహసీల్దార్), మల్యాల, కట్ట లింగంపేటకు బి ప్రదీప్ కుమార్ (ఎంపీవో), అనంతపల్లి, మూడపల్లికి సీహెచ్ దుర్గరాజు (ఎంఏఓ), సనుగుల, దేవుని తండాకు టి వెంకటేశ్వర్లు (ఏఈపీఆర్), కొత్తపేట, లింగంపేటకు కే శ్రీనివాస్(డీఈ), నర్సింగాపూర్, ఆశిరెడ్డిపల్లికి టి రాజేంద్రప్రసాద్ (డీసీవోఆర్ఎస్), జోగాపూర్, రామారావుపల్లికి కే శ్రీలత (డీటీ), మర్రిగడ్డ, ఎన్గల్‌కు ఈ రవిశంకర్ (ఏఈ)లను నియమించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 1: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి అమర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడని పీఈటీ ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 31న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగిన సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో అమర్ లాంగ్ జంప్ విభాగంలో అత్యంత ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచాడని పేర్కొన్నారు. ఈ నెల 10 నుం చి భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడని చెప్పారు. విద్యార్థి అమర్ ఎంపిక పట్ల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

రైతులు వ్యవసాయశాఖ సూచనలు పాటించాలి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 1: రైతులు వ్యవసాయశాఖ సూచనలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి సురేష్ పేర్కొన్నారు. మండలంలోని కందికట్కూర్ గ్రామంలో గురువారం రైతుల వరిపొలాలను పరిశీలించారు. వరిలో కాండంతొలుచు పురుగు, అగ్గితెగులు ఉన్నందున వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏఈవో దొడ్ల లతాశ్రీ, రైతులు పాల్గొన్నారు.

విమర్శలు మానుకుని ప్రజలకు సేవ చేయండి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 1: కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై విమర్శలు మానుకుని ప్రజలకు సేవ చేయాలని ఎంపీపీ రేణుక, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అందె సుభాష్‌లు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పలు అభివృద్ధి కార్యక్రమంలో ఎంపీపీ రేణుకను సభా వేదికపై మాట్లాడించకపోవడం శోచనీయమని అన్నారు. మహిళ ప్రజాప్రతినిధుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి బయట పడిందని అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును తాము గౌరవిస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాపాడుకోవాలని రేణుక, సుభాష్‌లు సూచించారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, తాజా, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్ద బోనాల అంబేద్కర్ సంఘం కార్యవర్గం ఎన్నిక

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 1: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దబోనాల గ్రామ అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని అంబేద్కర్ సంఘభవనంలో జరిగిన సమావేశంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా లింగంపల్లి పర్శయ్య, ఉపాధ్యక్షుడిగా పంగ ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా నేరేళ్ల దేవయ్య, కోశాధికారిగా లింగంపల్లి నర్సయ్య, ప్రచార కార్యదర్శిగా పంగ రాజనర్సు, సహాయ కార్యదర్శిగా నేదూరి భూమయ్య, ఆర్గనైజర్స్‌గా పంగ నారాయణ, పంగ అరుణ్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో డీలర్ లక్ష్మణ్, రవి, రాజలింగం, కోలాపురం దేవరాజు, లింగంపల్లి మధుకర్, రామస్వామి, సురేష్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జిని కలిసిన చీటి ఉమేశ్‌రావు



దీప్‌దాస్ మున్షీతతో చీటి ఉమేశ్‌రావు

సిరిసిల్ల, ఫిబ్రవరి 1(ఆంధ్ర జ్యోతి): ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని పీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని పార్టీ వ్యవహారాలపై దీపాదాస్ మున్షీతో ఉమేశ్‌రావు చర్చించి పరిస్థితిని వివరించారు. పార్టీ వ్యవహారాలు, పరిస్థితిపై నివేదికను అందించామని పీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు పేర్కొన్నారు.

నాగంపేటలో గోరుముద్ద ప్రారంభం

గంభీరావుపేట, ఫిబ్రవరి 1: మండలంలోని నాగంపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన వైద్యులు కొండ అంజనేయులు గౌడ్ ఆర్థిక సహాయంతో 10వ తరగతి విద్యార్థులకు గురువారం గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో నాగంపేటలో ఆర్ఎంపీగా పనిచేసిన అంజనేయులు ఆ గ్రామంపై ఉన్న అభిమానంతో గోరుముద్ద కార్యక్రమానికి రూ: 10 వేల రూపాయాలను తన వంతు ఆర్థిక సాయం అందించి ఆదర్శంగా నిలిచారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని అంజనేయులు ఆకాంక్షించారు. 10వ తరగతిలో ఫస్ట్ క్లాస్, సెకండ్ వచ్చిన విద్యార్థులకు నగదు అందిస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు అంజనేయులును సన్మానించారు. హెచ్ఎం బాల ఎల్లయ్య, ఉపాధ్యాయులు, ఎంపీటీసీ నాగభూషనం, నాయకులు ఎల్లం, పాఠశాల చైర్మెన్ రాజు ఉన్నారు.

ఆకట్టుకున్న సంగీత, నృత్య కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న కళాకారిణీలు

వేములవాడ, ఫిబ్రవరి 1: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీత్యాగరాజ స్వామి వారి ఆరాధన ఉత్సవాలలో భాగంగా మూడోరోజు గురువారం నిర్వహించిన కార్యక్రమాలు కళాభిమానులను ఆకట్టుకున్నాయి. ఉదయం జయంతి సావిత్రి భాగవతారిణి హరికథ వినిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం శ్రావ్య, రేవతి సంగీత కచేరితో ప్రేక్షకులను అలరించారు. మధ్యాహ్నం కూచిభట్ల వెంకటరమణ భాగవతార్ హరికథతో రంజింపచేశారు. సాయంత్రం అనుపమ, అభిరాంల సంగీత కచేరి, శ్రీవిద్య శాస్త్రీయ సంగీత కచేరి హృద్యంగా సాగింది. రాత్రి మంగళంపల్లి సూర్యదీప్తి వైలెన్ సోలో కచేరితో ప్రేక్షకులను మైమరిపింపచేశారు. అనంతరం ముత్తా పరమేశ్వర్, నృత్యరవళి కళాక్షేత్రం వారి నృత్య ప్రదర్శన, తోట సతీష్ బృందం నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి.



వయోలిన్ కచేరి చేస్తున్న మంగళంపల్లి సూర్యదీప్తి

దాడి కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 1: దాడి కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు ఇచ్చారు. సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన రాగుల రాములు అనే వ్యక్తి కుటుంబంపై పాత పగలు మనసులో పెట్టుకొని సిరిగిరి అనిల్, మేకల కమలాకర్, సిరిగిరి యాదగిరి ప్రమీలలు నవంబరు 17, 2013న కర్రలతో రాములపై దాడిచేశారు. ఈ దాడిలో రాములు తీవ్రంగా గాయపడగా సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సిఎంఎస్ ఎస్సై శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుఫున పిపి చెలుముల సందీప్ వాదించారు. నిందితులైన సిరిగిరి అనిల్ , మేకల కమలాకర్‌లకు మెజిస్ట్రేట్ మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా విధించారని, మిగితా ఇద్దరు మరణించారని సిఐ తెలిపారు.

కవిత్వం సామాజిక చైతన్యానికి చిరునామా

● జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు

తిమ్మాపూర్, ఫిబ్రవరి 1: కవిత్వం, సామాజిక చైతన్యానికి చిరునామా అని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు అన్నారు. గురువారం ఎల్ఎండి కాలనీలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయుల వృత్తి శిక్షణలో భాగంగా వివిధ రకాలైన సాహిత్య ప్రక్రియలను నేర్చుకోవాలన్నారు. కవిత్వంతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తులను బయటకు తీయవచ్చన్నారు. కవిత్వం సామాజిక చైతన్యానికి చలనశీలతకు దర్పణం అని, కవితలు రాయడం అలవర్చుకోవాలన్నారు. అనంతరం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్ విద్యార్థులకు కవిత్వ కార్యశాలను నిర్వహించారు. ప్రతి ఒక్కరిలో మానవీయ కోణం దాగి ఉంటుందని అందుకే ప్రతి వారు కవులు కావాలని అకాంక్షించారు. విద్యార్థి దశ నుంచే కవిత్వ రచన మెళకువలు నేర్చుకుంటే కవిత్వంపై పట్టు సాధించవచ్చన్నారు. ఛాత్రోపాధ్యాయులు, అధ్యాపకులతో కవిత్వం రాయించారు. ఈ సందర్భంగా వారి స్వీయ కవిత్వంతో పాటు వివిధ తెలుగు కవుల కవిత్వాన్ని ఉర్దూ కవి అయిన గుల్జార్ కవిత్వాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య, ఛాత్రోపాధ్యాయులు డాక్టర్ కె శంకర్, జి మహేశ్వర్‌రెడ్డి, గాజుల రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, మంజుల, హబీబ్ ఉరు రహమన్, అబ్దుల్ రవుఫ్, ఖయ్యూం, సురేఖ, శ్రీలత పాల్గొన్నారు.

రూ.6,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 1: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,600 పలికింది. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు 92మం ది రైతులు 890క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు 17క్వింటాళ్ల గోనె సం చుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,800,కనిష్ఠ ధర రూ.5,200 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

హుజూరాబాద్, ఫిబ్రవరి 1: హుజూరాబాద్ ప్రాంతంలో గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ గురువారం తెలిపారు. గత 15రోజులుగా హుజూరాబాద్, జమ్మికుంట ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు సిర్సపల్లి క్రాస్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటర్ సైకిల్‌పై వచ్చిన ముగ్గురు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నామన్నారు. జమ్మికుంటకు చెందిన గండికోట గనీ, రాములపల్లికి చెందిన అజయ్‌తో పాటు ఓ బాలుడిని అదుపులో కి తీసుకొని విచారించగా ఆంధ్రప్రదేశ్‌లోని అరుకు నుంచి గంజాయిని హుజూరాబాద్ పట్టణానికి చెందిన దుండగుల వెంకటేష్, పరుశరాములు తీసుకొచ్చి తమకు ఇచ్చారని తెలిపారు. వెంకటేష్, పరుశరాములు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ముగ్గురి వద్ద నుంచి 560గ్రాముల ఎండు గంజాయిని, మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 1: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సద్దిమద్దుల సంఘం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని స్థానికులు తెలిపారు. ఆలయంలోని చొరబడిన దొంగలు హుండీని ధ్వంసం చేసి నగదును అపహరించుకుపోయారు. గురువారం ఉదయం ఆలయంలో పూజలు చేయడం కోసం వెళ్లిన భక్తులకు హుండీ తాళం పగులకొట్టి కనిపించడంలో ఆలయ కమిటీ సభ్యులుకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రెండు రోజుల కిందట శివాలయం, శ్రీవేణుగోపాలస్వామి బాలాలయంలో చోరీకి యత్నించిన ఘటన మరువక ముందే ఆంజనేయస్వామి ఆలయంలో చోరీకి పాల్పడడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

భారత్‌కు 31 సాయుధ డ్రోన్లు

వాషింగ్టన్, ఫిబ్రవరి1: వాస్తవాధీన రేఖ వెంబడి చైనాకు చెక్ పెట్టేందుకు.. హిందూ మహాసముద్రంలో పట్టు పెంచుకునేందుకు ఇండియాకు ఎంతగానో ఉపయోగపడే ఎమ్‌క్యూ-9బి ప్రిడేటర్ డ్రోన్లను విక్రయించడానికి అమెరికా ప్రభుత్వం గురువారం ఆమోదం తెలిపింది. ఈ డీల్ కింద 3.99 బిలియన్ డాలర్ల (సుమారు రూ.33వేల కోట్లు) విలువైన 31 డ్రోన్లను అమెరికా సరఫరా చేయనుంది. ఎమ్‌క్యూ-9బి రిమోట్లీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా పిలిచే ఈ సాయుధ డ్రోన్ల కొనుగోలుపై గత జూన్‌లో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. ఇందుకు అవసరమైన అనుమతి మంజూరు చేస్తూ అమెరికా కాంగ్రెస్ సర్టిఫికెట్ ఇచ్చిందని డిఫెన్స్ సెక్యూరిటీ కో-ఆపరేషన్ ఏజెన్సీ తాజాగా తెలిపింది. అమెరికా-భారత్ మధ్య వ్యూహాత్మక సంబంధాల బలోపేతంలో భాగంగా ఈ మెగా డ్రోన్‌డీల్ జరిగిందని పేర్కొంది. భారత్ భద్రతను పెంచేందుకు, ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతంలో సుస్థిర, శాంతి, ఆర్థిక ప్రగతిని పెంపొందించేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపింది. మానవరహిత నిఘా విషయంలో భారత్ సామర్థ్యాలు మరింత బలోపేతమవుతాయని అభిప్రాయపడింది. సైన్యం ఆధునికీకరణకు భారత్ కట్టుబడి ఉందని, అందువల్ల వీటిని అందజేయడంలో తమకు ఇబ్బందేమీ లేదని పేర్కొంది. వీటిని హై ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (హెచ్‌ఏఎల్‌ఈ-హేల్)యూఏవీలుగా వ్యవహరిస్తారు. ఈ 31లో 15 డ్రోన్లను సీగార్డియన్ల పేరుతో నేవీకి ఇస్తారు. స్కై గార్డియన్ పేరుతో ఎయిర్‌ఫోర్స్‌కు 8డ్రోన్లు, ల్యాండ్ వర్షన్ పేరుతో ఆర్మీకి మిగతా 8కేటాయిస్తారు. ఖలిస్థాన్ ఉగ్రవాది గురుప్రీత్ సింగ్ పన్నూన్ హత్యకు భారత్ కుట్రపన్నుతున్నందున డ్రోన్లఅమ్మకాల ఒప్పందాన్ని అమెరికా నిలిపివేస్తుందంటూ వార్తలువచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ఆమోదం లభించింది.

వీసా ఫీజులు భారీగా పెంచిన అమెరికా

వాషింగ్టన్, ఫిబ్రవరి1: అమెరికాకు వచ్చే విదేశీయుల నుంచి వసూలు చేసే నాన్-ఇమిగ్రెంట్ వీసా ఫీజులను బైడెన్ ప్రభుత్వం బుధవారం భారీగా పెంచింది. వీసా ఫీజులను పెంచడం 2016 తర్వాత ఇదే ప్రథమం. ఏప్రిల్1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. భారతీయులకు అత్యంత ఉపయోగకరంగాఉండే హెచ్-1బీ, ఎల్-1, ఈబీ-5 వీసాల రుసుములు గణనీయంగా పెరిగాయి. విదేశాల వృత్తి నిపుణులు అమెరికాలో ఉద్యోగాలు చేయడానికి హెచ్-1బీ వీసాలు ఇస్తారు. ఇందుకు ఉద్దేశించిన ఫారం 1-129 ఫీజు 460డాలర్ల (రూ.38,150)నుంచి 780డాలర్ల (రూ.64,690)కు పెరిగింది. హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్ రుసుము 10 డాలర్ల నుంచి 215 డాలర్ల (రూ.17,830)కు పెంచారు. ఈ నిర్ణయం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుంది. బహుళజాతి కంపెనీ ఉద్యోగుల బదిలీకి ఉద్దేశించిన ఎల్-1 వీసాల రుసుములు 460డాలర్ల నుంచి 1,385 డాలర్ల (రూ.1,14,860)కు పెరిగాయి. అమెరికా పౌరులకు ఉద్యోగాలిచ్చే వారికి ఈబీ-5 వీసాలు మంజూరు చేస్తారు. వీటి రుసుములు 3,675డాలర్ల నుంచి 11,160 డాలర్ల (రూ.9,25,510)కు పెరిగాయి. మరికొన్ని రకాల వీసాల ఫీజులు స్వల్పంగా తగ్గాయి.

కాంగ్రెస్ వలలో పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేయకండి. సీఎంను కలవాలనుకుంటే సమాచారం ఇచ్చి వెళ్లండి' అని సున్నితంగా హెచ్చరించినట్లు సమాచారం. "కాంగ్రెస్ ప్రభుత్వం చాలా సవాళ్లను ఎదుర్కొనాల్సి ఉంది. రాష్ట్ర ఆదాయం అంతంతమాత్రంగా ఉంది. కనీసం అంచనా వేయకుండానే ఇబ్బడిముబ్బడి హామీలిచ్చారు. అమలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఉంటుందా? ఉండదా? అనేది వారి చేతుల్లోనే ఉంది. ప్రతిపక్షంగా సమర్థంగా వ్యవహరిద్దాం. ఏడాది లోపే ప్రజలకు అసలు విషయం తెలుస్తుంది. మనం తొందరపడాల్సిన పనిలేదు. సంయమనం పాటిద్దాం. చక్కగా నిలబడితే చాలు.. వచ్చే ప్రభుత్వం మనదే"నని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలించామని.. ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహం, భయడాల్సిన అవసరం లేదన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే అంశంపై పార్లమెంటులో నిరసన తెలపాలని ఎంపీలకు సూచించారు. కేంద్ర జల శక్తి శాఖ మంత్రినీ కలవాలని నిర్దేశించారు. లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా పోరాడదామని.. అందరితో చర్చించి, మంచి అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు.

అసాధ్యమని ఆర్బీఐనే చెప్పింది

రూ.36 వేల కోట్ల రైతు రుణమాఫీ అసాధ్యమని, ఏక మొత్తంలో ఇన్ని కోట్లు మాఫీ వీలుకాదని ఆర్బీఐ తెలిపిందని పార్టీ నేతల వద్ద కేసీఆర్ వ్యాఖ్యానించారు. అయినా.. ఏపీలో చెల్లించారు. తెలంగాణలోనూ రుణమాఫీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి రైతాంగాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. "మనం అధికారంలో ఉన్నప్పుడే కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదు. కాంగ్రెస్ ఉంటే చేస్తుందా? వాళ్లకూ చేయదు. శుక్రవారం తెలంగాణ భవన్‌కు వస్తా. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటా" అని కేసీఆర్ తెలిపారు. కాగా, బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుసరించాల్సిన తీరుపై అంశాల వారీగా చర్చించారు. కేటీఆర్, పోచారం, హరీశ్‌రావు, తలసాని, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ప్రమాణం

గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డ ప్రసాద్ తన



చాంబర్‌లో మధ్యాహ్నం 12.45 గంటలకు ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పోచారం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలోని ప్రతిపక్ష నేత చాంబర్‌లో కేసీఆర్ ప్రత్యేక పూజలు చేసి బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా బాధ్యతలు చేపట్టారు. కాగా, ఈ కార్యక్రమాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కాలె యాదయ్య, పద్మారావుగౌడ్ హాజరు కాలేదని సమాచారం.

రేవంత్ నేను పాత మిత్రులం!

త్వరలోనే రేవంత్‌ను కలుస్తా: మల్లారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): "నేను రేవంత్‌రెడ్డి పాత మిత్రులం. టీడీపీలో కలిసి పనిచేశాం. ఇప్పుడు ఆయన రాష్ట్ర సీఎం. ఆయనను కలిస్తే తప్పేంటి" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రేవంత్‌ను త్వరలోనే కలుస్తానని చెప్పారు. కీసర ఆలయంలో నిర్వహించబోయే పూజా కార్యక్రమాలకు ఆహ్వానిస్తానని తెలిపారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. మల్కాజిగిరి ఎంపీ స్థానంలో పోటీ చేయాలని బీఆర్ఎస్ అధిష్ఠానం తనను కోరుతోందని చెప్పారు. అయితే, తన కుమారునికి అవకాశం కల్పించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశానన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని చెప్పారు. అయితే, "రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఆ పార్టీ వాళ్లకు షాక్.. అధికారం కోల్పోవడం మాకు షాక్" అని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. కాగా, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించిందన్న మల్లారెడ్డి.. త్వరలో గోవాలో రియల్ వ్యాపారం చేస్తానని చెప్పారు. ఇప్పటికే గోవాలో ఓ హోటల్ కొన్నట్లు తెలిపారు.

పాత.. కొత్త స్పీకర్ల కలయిక!



బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 1: ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్లుగా పనిచేసిన, చేస్తున్న ముగ్గురు ఒకచోట కలిశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరపున అసెంబ్లీ స్పీకర్‌గా 2014-19 వరకు మధుసూదనా చారి, 2019-23 వరకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొనసాగారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తరపున 2023 డిసెంబరు నుంచి గడ్డం ప్రసాద్.. స్పీకర్‌గా కొనసాగుతున్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం సందర్భంగా వారు ముగ్గురు కలిశారు. ఈ సందర్భంగా ముగ్గురూ కలిసి ఫొటో దిగారు.

టచ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. హైకమాండ్ వద్దనడంతో ఆగాం

» ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

కామారెడ్డి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలా మంది కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పలువురు ఎమ్మెల్యేలు కలవడమే ఇందుకు నిదర్శనం. వారంతా కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయి. అయితే.. హైకమాండ్ ఇప్పుడప్పుడే పార్టీ ఫిరాయింపులు వద్దని చెప్పింది. అందుకే.. ఫిరాయింపులను ప్రోత్సహించడంలేదు" అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వ్యాఖ్యానించారు. గురువారం ఆయన కామారెడ్డిలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. కేటీఆర్ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారంటూ షబ్బీర్ అలీ మండిపడ్డారు. "రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీ కొట్టినప్పటికీ కేటీఆర్ అహంకారం తగ్గడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకముందే సర్కారును కూల్చేస్తామని, త్వరలోనే ప్రభుత్వం పడిపోతుందంటూ కేటీఆర్ అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వాన్ని ఎలా కూలుస్తారో చూస్తాం" అని సవాల్ విసిరారు. పదేళ్లుగా రాష్ట్రాన్ని బీఆర్ఎస్ లూటీ చేసిందని ఆరోపించారు. ఓ అధికారి వద్దే రూ.100 కోట్ల అవినీతి సొమ్ము బయటపడడం బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు.

ఎంపీ టికెట్ ఆశావహులతో గాంధీభవన్‌లో సందడి

కాంగ్రెస్ టికెట్ కోసం 41 మంది దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు దరఖాస్తులు సమర్పించడానికి వచ్చిన ఆశావహులు, వారి అనుచరులతో గాంధీభవన్‌లో గురువారం సందడి నెలకొంది. పార్టీ తరఫున తమకు టికెట్ కేటాయించాలని కోరుతూ 41 మంది అభ్యర్థులు దరఖాస్తులు ఇచ్చారు. బుధవారం ఏడుగురు దరఖాస్తు చేసుకోగా గురువారం 34 మంది పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ దరఖాస్తులను సమర్పించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి ఖమ్మం పార్లమెంట్ స్థానానికి దరఖాస్తు చేశారు. అదే నియోజకవర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు దరఖాస్తు సమర్పించారు. భువనగిరి నుంచి చామల కిరణ్ కుమార్ రెడ్డి, నిజామాబాద్ నుంచి ఆకుల లలిత తదితరులు లోక్‌సభ బరిలో నిలిచేందుకు తమకు అవకాశం కల్పించాలని దరఖాస్తులు అందజేశారు. నియోజకవర్గాల వారిగా.. మహబూబాబాద్ 9, నాగర్‌కర్నూల్ 8, వరంగల్ 6, భువనగిరి 6, ఖమ్మం 2, నిజామాబాద్ 3 చొప్పున దరఖాస్తులు అందినట్లు గాంధీభవన్ వర్గాలు పేర్కొన్నాయి.

బడ్జెట్‌లో అందమైన అబద్ధాలు చెప్పారు

» సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌లో అందమైన భాషతో అందమైన అబద్ధాలు చెప్పారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. బడ్జెట్‌లో ఉద్యోగాల ఊసే లేదని, కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేశారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు ప్రకటించలేదన్నారు. విద్యా రంగానికి 10శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా విస్మరించారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేలా బడ్జెట్ ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ విమర్శించారు.

ఇది భ్రమల బడ్జెట్: తమ్మినేని

కేంద్ర బడ్జెట్‌ను కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే, ప్రజలను భ్రమల్లో పెట్టే బడ్జెట్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రకటించిన బడ్జెట్ ఇది అని పేర్కొన్నారు.

జనాభా వృద్ధి రేటు సవాళ్లపై కమిటీ

» ఉన్నతాధికారులతో ఏర్పాటు చేయనున్న కేంద్రం

» సంతానోత్పత్తి రేటు తగ్గుతోందంటూ నివేదికలు

» తగినంతగా రీ ప్లేస్‌మెంట్ లేదనే ఆందోళనలు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో జనాభా వృద్ధి రేటులో ఎదురవుతున్న సవాళ్లపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మల తెలిపారు. సంతానోత్పత్తి రేటు భర్తీ స్థాయుల (రీప్లేస్‌మెంట్ రేట్) కంటే పడిపోయినట్లు గణాంకాలు సూచిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశంలో 2011లో చివరిసారిగా జనాభా లెక్కల సేకరణ చేపట్టారు. 2021లో మళ్లీ గణన నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ నేపథ్యంలో వాయిదా వేశారు. ఈ క్రమంలో జనాభాపై సాధికార లెక్కలు లేవు. వృద్ధి రేటు 2.1 నుంచి 2కి తగ్గిందంటూ 2020 నాటి శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్), 2.2 నుంచి 2కు పడిపోయిందంటూ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) పేర్కొన్నాయి. దీనికి పరిష్కార మార్గాలను కమిటీ సూచించనుంది. జనాభా వేగవంతమైన వృద్ధి, మార్పుల నుంచి ఉత్పన్నమయ్యే సవాళ్లను పరిశీలించనుంది.

గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు యాభై ఏళ్లు

» భాగ్యనగరం నుంచి వాల్తేరుకు మొదటి రైలు ఇదే

» 1974 ఫిబ్రవరి 1న ప్రారంభమైన ఎక్స్‌ప్రెస్



సికింద్రాబాద్/హైదరాబాద్ సిటీ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎక్స్‌ప్రెస్.. ఏపీలోని ఉభయ గోదావరి జిల్లాలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన రైలు ప్రయాణికులకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రైలు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో బెర్తు దొరికిందంటే.. బంగారం బిస్కెట్ దొరికినంతగా విశాఖ ప్రాంతవాసులు ఆనందపడతారంటే అతిశయోక్తికాదు. 1974 ఫిబ్రవరి 1న హైదరాబాద్-విశాఖపట్నం మధ్య ప్రారంభమైన మొట్టమొదటి రైలు ఇది. అంటే ఈ రైలు ప్రవేశపెట్టి గురువారానికి సరిగ్గా యాభై ఏళ్లు పూర్తయ్యాయి. గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రస్తుతం హైదరాబాద్(నాంపల్లి) స్టేషన్ నుంచి సాయంత్రం 5.05గంటలకు బయల్దేరి సికింద్రాబాద్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి మీదుగా.. విశాఖపట్నానికి చేరుకుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్ధండులైన ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు ఇది ఎంతో ముఖ్యమైన రైలుగా ఉండేది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రావాలన్నా, ఇక్కడ్నుంచి స్వస్థలాలకు వెళ్లాలన్నా ఈ రైలులో వెళ్లడాన్ని సౌకర్యవంతంగా భావిస్తారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారుల తాకిడి కొంత తగ్గినా.. సాధారణ ప్రయాణికుల నుంచి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. దక్షిణ మధ్యరైల్వే ఆధ్వర్యంలో నడుస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు మొత్తం 18స్టేషన్లలో ఆగుతుంది. 24 బోగీలతో అతిపొడవైన రైలుగా పేరుగాంచిన ఈ ఎక్స్‌ప్రెస్ 710 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. గురువారం సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు రైల్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు నాంపల్లి స్టేషన్‌లో ఘనంగా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం విశేషం. దక్షిణ మధ్య రైల్వే కూడా ఈ ఎక్స్‌ప్రెస్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించింది. ఈ రైలు ఆగే అన్ని స్టేషన్లలో వేడుకలు జరిపారు. 1990లోనే 24 కోచ్‌లతో అతి పెద్ద రైలుగా పేరొందిన గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో 2000 సంవత్సరం నుంచి ఫస్ట్‌క్లాస్ ఏసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 1993 నుంచే థర్డ్ ఏసీ కోచ్‌లున్న ఈ రైలు.. దక్షిణ మధ్య రైల్వేలోనే మొదటి ఏసీ కోచ్ ఉన్న ఎక్స్‌ప్రెస్‌గా పేరుగాంచింది. ఈ ఎక్స్‌ప్రెస్‌ను నేరుగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ పర్యవేక్షిస్తారంటే దానికి ఉన్న ప్రాముఖ్యత చెప్పనక్కర్లేదు. రైలు నిర్వహణ నుంచి సమయపాలన, పరిశుభ్రత, ఆహార నాణ్యత, ఫిర్యాదులు, ఇతర ఆపరేషన్స్ అన్నీ ప్రతిరోజూ జీఎం టేబుల్ మీద ఉండాల్సిందేనని చెబుతుంటారు.

74 టీఎంసీలు కేటాయించాలి!

గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రాన్ని డిమాండ్ చేసిన తెలంగాణ

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానంలో తరలించే 148 టీఎంసీల జలాల్లో 74 టీఎంసీలను తమకు కేటాయించాలని తెలంగాణ కోరింది. నదుల అనుసంధానంలో తెలంగాణకు 45 టీఎంసీలు కేటాయించాలని ప్రతిపాదించారని, అవి సరిపోవని తెలిపింది. పూర్వ నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పలు ప్రాంతాలకు సాగునీటిని అందించాల్సి ఉన్నందున, 74 టీఎంసీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. గోదావరి-కావేరి అనుసంధానంపైతెలంగాణ లేవనెత్తిన అంశాలపై చర్చించడానికి వీలుగా గురువారం జలసౌధలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) హైదరాబాద్ విభాగం చీఫ్ ఇంజనీర్ దేవేందర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ నుంచి ఈఎన్‌సీ బి.నాగేంద్రరావు, అంతరాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. గోదావరి-కావేరి అనుసంధానంతో వివిధ అంశాలపై రాష్ట్ర అధికారులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కాగా తెలంగాణ అభ్యంతరాలపై మళ్లీ సమావేశం ఉంటుందని ఎన్‌డబ్ల్యూడీఏ స్పష్టం చేసింది. అనుమానాలన్నీ నివృత్తి చేశాకే నదుల అనుసంధానంలో ముందుకెళతామని తెలిపింది.

నేటి నుంచి పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి పంచాయతీలకు ప్రత్యేక అధికారులు బాధ్యత వహించనున్నారు. ఈ మేరకు గ్రామ ప్రత్యేకాధికారుల నియామకం, బాధ్యతల స్వీకరణ, విధి విధానాలను సూచిస్తూ.. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓ, తహసీల్దారు, ఎంపీఓ, డీటీ, ఆర్ఐ, ఇంజినీర్లు, ఎంఈవోలు, ఇతర గెజిటెడ్ స్థాయి అధికారులను గ్రామ ప్రత్యేక అధికారులుగా నియమించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడంతో పదేళ్ల తర్వాత మళ్లీ గ్రామాల్లో ప్రత్యేక పాలన ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించడంతో గురువారం సర్పంచుల వద్ద ఉన్న డిజిటల్ కీలు, చెక్కులు, ఇతర రికార్డులన్నీ సీజ్ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.

నేడు ఈజీఎస్ ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటన..?

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వం పే స్కేల్ ప్రకటిస్తామని హామీ ఇచ్చింది.. అది అమలుకు నోచుకోలేదు.. కొత్త ప్రభుత్వం మా ఆశలు నెరవేరుస్తుందని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నేడు(శుక్రవారం) ఇంద్రవెల్లి సభలో తమ పే స్కేల్ ప్రకటిస్తారని, సంబురాలు జరుపుకొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నామని ఈజీఎస్ ఉద్యోగులు ఒక ప్రకటనలో తెలిపారు.

కోర్టు ఆదేశాలిచ్చిన గంటల్లోనే జ్ఞానవాపీ సెల్లార్‌లో పూజలు

» హైకోర్టులో అప్పీలు చేసిన మసీదు కమిటీ

వారాణసి, ఫిబ్రవరి 1: జ్ఞానవాపీ మసీదు సెల్లార్‌లోని 'వ్యాస్ కీ టిఖానా'లో ఉన్న హిందూ దేవత విగ్రహాలకు పూజలు చేసుకోవచ్చంటూ జిల్లా కోర్టు ఆదేశాలు ఇచ్చిన కొద్ది గంటల్లోనే అక్కడ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో పూజలు చేసి లక్ష్మీదేవి, వినాయకులకు హారతి ఇచ్చారు. 31 సంవత్సరాల అనంతరం వ్యాస్‌జీ కా టిఖానాను పూజల కోసం తెరిచారని కాశీ విశ్వనాథ మందిర ట్రస్టు అధ్యక్షుడు నాగేంద్ర పాండే తెలిపారు. కాగా, తమకు అప్పీలు వంటి న్యాయ ప్రక్రియకు కూడా అవకాశం ఇవ్వకుండా హిందువులు పూజలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం తగదని పేర్కొంటూ మసీదు కమిటీ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే తొలుత హైకోర్టులో పిటిషన్ వేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పడంతో దాన్ని అమలు చేసింది. అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ సమర్పించి అత్యవసరంగా విచారణ జరపాలని కోరింది.

హేమంత్ సోరెన్‌కు ఒక రోజు కస్టడీ

» 10 రోజుల పాటు ఇవ్వాలన్న ఈడీ వినతిపై నేడు తీర్పు

» రాంచీలో 8.5 ఎకరాలు ఆక్రమించినట్టు కేసు నమోదు

రాంచీ, ఫిబ్రవరి 1: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను గురువారం ఇక్కడి పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టు ఒక రోజు జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది. పోలీసులు ఆయనను ఇక్కడి బీర్సా ముండా సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయనను పది రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలన్న వినతిపై కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. ఈడీ బుధవారం ఆయనను ఏడు గంటల పాటు విచారించింది. అనంతరం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా రాత్రి పది గంటల సమయంలో గవర్నర్ హౌస్ వద్ద అరెస్టు చేసింది. కాగా, రాత్రి సమయంలో గవర్నర్ హౌస్ ఆవరణలోనే అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ గురువారం సోరెన్ లాయర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సమయంలో ఆయన ధరించిన మతమపరమైన లాకెట్, రింగ్‌లను తీసివేయాలని ఈడీ అధికారులు కోరగా అందుకు ఆయన నిరాకరించారు. రాంచీలో సోరెన్ 12 చోట్ల 8.5 ఎకరాల విస్తీర్ణంగల స్థలాలను అక్రమంగా కలిగి ఉన్నారంటూ ఈడీ కేసుపెట్టింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ నగదు చలామణి జరిగినట్టు ఆరోపించింది. తొలుత భూమి రికార్డుల నకిలీ పత్రాలను తయారు చేస్తున్నారంటూ రెవెన్యూ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్‌పై కేసు నమోదయింది. ఆయన వద్ద 11 ట్రంకు పెట్టెల్లో ఒరిజినల్, నకిలీ దస్త్రావేజులు, 17 ఒరిజినల్ రిజిస్టర్లు లభించాయి. దీనిపై జరిగిన విచారణలో ఇందులో సోరెన్‌కు సంబంధం ఉందంటూ ప్రసాద్ ఫోన్‌లో లభించిన సమాచారం ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. వాంగ్మూలం నమోదు చేయడానికని పిలిచి ఎలా అరెస్టు చేస్తారని సోరెన్ తరఫున హాజరైన అడ్వకేట్ జనరల్ రాజీవ్ రంజన్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి జరిగిన కుట్ర అని ఆరోపించారు.



జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలను తరలించడానికి బేగంపేట విమానాశ్రయం వద్ద సిద్ధంగా ఉన్న బస్సులు

ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

చంపయి సోరెన్ గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిశారు. హేమంత్ సోరెన్ రాజీనామా చేసిన అనంతరం రాష్ట్రానికి కొత్త సీఎం లేకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొని ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి లేకపోవడంతో రాజకీయ సంక్షోభం ముదిరిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న తమ విజ్ఞప్తిని అంగీకరించాలని కోరారు. కాగా, చంపయి సోరెన్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేయడంతో.. జేఎంఎం-కాంగ్రెస్ కూటమి ఎమ్మెల్యేలను హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం రెండు చార్టర్డ్ విమానాలను సిద్ధం చేయగా.. సాయంత్రం 6.30 గంటల సమయంలో పొగమంచు ఎక్కువగా ఉండడంతో వాటిని రద్దు చేశారు. 81 మంది సభ్యులున్న ఝార్ఖండ్ అసెంబ్లీలో జేఎంఎం కూటమికి 43 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక మనీలాండరింగ్ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ మాజీ సీఎం హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను విచారించేందుకు సీజేఐ ముగ్గురు న్యాయమూర్తులతో ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. సోరెన్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరపనున్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడానికే పోటీలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 1: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడానికే ప్రతిభా పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోషల్‌టాలెంట్ టెస్టును నిర్వహించారు. విజేతలుగా శ్యామ చరణ్, మధు, అమూల్య, పర్ణిక నిలిచారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందించి, ఈ నెల 3న జిల్లాకేంద్రంలో జరిగే పోటీలకు పంపిస్తున్నట్లు ఎంఈవో బన్నాజీ తెలిపారు. కార్యక్రమంలో సోషల్‌టీచర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, మండల బాధ్యులు పద్మ, వెంకన్న, స్వాతిలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా దేవేందర్



సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 1: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయూ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా వేములవాడకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ దాసరి దేవేందర్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర యూనియన్ కార్యాలయంలో జరిగిన స్టేట్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో రాష్ట్ర ఎన్నికల అధికారి రవీంద్ర శేషు ప్రకటించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ జర్నలిస్ట్‌ల సంక్షేమంతో పాటు హక్కుల పరిరక్షణ, మీడియా స్వేచ్ఛ కోసం అవిశ్రాంతంగా పోరాడుతానని తెలిపారు. జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఆరోగ్య భద్రత, ఇళ్ల స్థలాల సాధన కోసం ప్రత్యేక దృష్టి సారిస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్నికైన దాసరి దేవేందర్‌ను జర్నలిస్టులు టీవీ నారాయణ, గడ్డం సత్యనారాయణరెడ్డి, సిద్దుల మురళి, చింతకింది శ్యాం, అమరగొండ కిషన్, కంకణాల శరత్, రాచర్ల రాజు అభినందించారు.

పొలం అమ్మినా తీరని అప్పులు

- మనస్తాపంతో రైతు ఆత్మహత్య



సంబు బీరయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 1: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సంబు బీరయ్య (61) అనే రైతు అప్పుల బాధతో గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రమాకాంత్, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. బీరయ్య తనకున్న నాలుగెకరాల్లో వరి సాగు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఐదు లక్షల రూపాయలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టి పంట సాగు చేసినా దిగుబడి రాలేదు. ఈ క్రమంలో మరో రూ. 45 లక్షలు బాకీలు చేసి ఇంటి నిర్మాణ పనులు చేపట్టాడు. ఉన్న ఊరిలో ఉపాధి లేక చిన్న కొడుకు ప్రశాంత్‌ను మూడు లక్షలు అప్పు చేసి గల్ఫ్ దేశానికి పంపించాడు. అక్కడ పనులు లభించకపోవడం, పంట దిగుబడి తగ్గడంతో కుటుంబ పోషణ తలకు మించిన భారంగా మారింది. దీంతో నాలుగెకరాల పొలాన్ని 40 లక్షల రూపాయలకు ఇటీవల విక్రయించాడు. అయినా పూర్తిస్థాయిలో బాకీలు తీరే మార్గం లేకపోవడంతో మనస్తాపం చెందిన బీరయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య వెంకటవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించిన యూత్ కాంగ్రెస్

కోనరావుపేట, ఫిబ్రవరి 1: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా కోనరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ మాట్లాడుతూ కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రజల సమస్యలపై పోరాడాలే తప్ప ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే బాగుండదని హెచ్చరించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు భూమేష్, బండి పోల్, రాజూరి వెంకటేష్, అనిల్, వేణు, కిరణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చందుర్తి, ఫిబ్రవరి 1: కేడీసీసీ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సీసీలు, సీఏలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందుర్తి కేడీసీసీ బ్యాంక్ బ్రాంచ్ సేవలను విస్తృతంగా ఉపయోగించుకోవాలన్నారు. మహిళా సంఘాలకు ఇచ్చే లింకేజీ రుణాలను కేడీసీసీ చందుర్తి శాఖ ద్వారా ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అజయ్, ఏపీఎం రజిత, సీసీలు, సీఏలు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయండి

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 1: టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యావైజ్ఞానిక ద్వితీయ మహాసభలు ఖమ్మం పట్టణంలో ఈ నెల 11, 12వ తేదీల్లో జరుగుతాయని వీటిని జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి కోరారు. సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ బాలిక ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల ఉపాధ్యాయ బృందం అధ్వర్యంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యావిజ్ఞాన మహాసభలకు ఉపాధ్యాయులు, మేధావులు, విద్యా అభిమానులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లోకిని శారద, మండలప్రధాన కార్యదర్శి మైలారం తిరుపతి, నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్, రాంబాబు, మధుసూధన్, రమేష్‌రాజలింగం, నరేందర్, రవి, జయంతి, స్వప్న, విజయలక్ష్మీ, అర్చన, కవిత తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులకు ఓటరుపై అవగాహన

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 1: సిరిసిల్ల పట్టణం ఆర్డీవో కార్యాలయం ఆవరణలో గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఓటరుపై ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో అనంద్‌కుమార్ అవగాహన కల్పించారు. రాష్ట్ర, జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో ఆనంద్‌కుమార్ సిరిసిల్లలోని వివిధ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం సిరిసిల్ల నియోజకవర్గంకు సంబంధించిన ఎస్ఎస్ఆర్- 2024 షెడ్యూల్ గురించి, 6,7,8నకు సంబంధించిన దరఖాస్తుల స్థితిని వివరించారు. పీఎస్ఈ/డీఎస్ఈ, ఏఎస్‌డీలకు సంబంధించి, ఓటరు అవగాహన నిమిత్తం ఏర్పాటు చేయబడిన ఈవీఎం, వీవీపాట్‌పై అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు గజభీంకర్ రాజన్న, బీజేవైఎం నాయకుడు అనిల్‌కుమార్, సీపీఐ(ఎం)నాయకుడు రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెల్ముల తిరుపతిరెడ్డి, కాముని నళినీకాంత్, టీడీపీ నాయకుడు తీగల శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 1: ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినయోగించుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినయోగం అనే అంశంపై విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్వీ నాయకులు విద్యార్థులతో ఓటు హక్కును వినియోగించుకుంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ ఓటు అనే ఆయుధంతో ప్రభుత్వంను ఏర్పాటు చేసే అధికారం ఉంటుందన్నారు. అనంతరం బోయినిపల్లి వినోద్‌కుమార్‌ను కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపించాలని విద్యార్థులకు కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు మానాల అరుణ్, ఎస్కే బాబా, మెట్ల సాయి, మామిడాల శ్రీనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట, జనవరి ఫిబ్రవరి 1: గంభీరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద చెల్ల నర్సయ్యకు బీమా యోజన కింద రెండు లక్షల చెక్కును నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు గురువారం అందజేశారు. సహకార బ్యాంక్‌లో ఖాతాదారు అయిన గజసింగవరం గ్రామానికి చెందిన చెల్ల నర్సవ్వ ఇటీవల మరణించగా, నామిని అయిన చెల్ల నర్సయ్యకు ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన కింద రెండు లక్షల రూపాయల విలువైన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ ఎం శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, సింగిల్‌విండో మేనేజర్ సత్యంరావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గోగు లింగమ్‌యాదవ్, నాయకులు వెంకటి, ధన్‌రాజ్, స్వామి ఉన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక పాలన షురూ

- ముగిసిన సర్పంచ్‌ల పదవీకాలం - రెండు గ్రామ పంచాయతీలకు ఒక ప్రత్యేక అధికారి - జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. సర్పంచ్‌ల పాలకవర్గం గడువు గురువారంతో ముగిసిపోవడంతో ప్రత్యేకాధికారులు విధులు నిర్వర్తించే విధంగా పంచాయతీరాజ్ శాఖ జీవో నంబర్ 5ను విడుదల చేసింది. శుక్రవారం ప్రత్యేకాధికారులగా గెజిటెడ్ స్థాయి అధికారులు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటికే నియామకాలను పూర్తి చేశారు. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గెజిటెడ్ స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియామకం చేపట్టారు. ప్రస్తుతం రెండు గ్రామ పంచాయతీలకు ఒక అధికారిని నియమించారు. జిల్లాలో 139 మందికి ఆర్డర్లను ఇచ్చారు. వివిధ శాఖల నుంచి గెజిటెడ్ అధికారులను గుర్తించి నియామకాలు చేపట్టారు. గ్రామపంచాయతీ ఎన్నికలు పార్లమెంట్ ఎన్నికల తర్వాతే ఉంటాయని భావిస్తున్నారు.



● పెండింగ్ బిల్లులపై సర్పంచ్‌ల ఆందోళన

జిల్లాలో పంచాయతీపాలన ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్లింది. ఇప్పటివరకు గ్రామాల్లో సర్పంచులు చేసిన వివిధ అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని పనుల బిల్లులు పెండింగ్ దశలో ఉండగా కొందరు సొంత డబ్బులతో పనులు చేసి రికార్డు కానివి కూడా ఉన్నాయి. పదవీకాలం ముగిసిపోవడంతో డబ్బులు ఎలా అనే సందిగ్ధంలో పడ్డారు. ప్రభుత్వం కనీసం ఏకగ్రీవ గ్రామపంచాయతీలకు అందిస్తామన్న ప్రోత్సాహక నిధులు కూడా అందించలేదు. జిల్లాలో 41 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. పదిలక్షల చొప్పున రూ 4.10 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో పంచాయతీలకు ఏకగ్రీవ ప్రోత్సాహం ఏడు లక్షల రూపాయలు ఉంటే తెలంగాణ ప్రభుత్వం రూ పది లక్షలకు పెంచింది. సిరిసిల్ల నియోజకవర్గంలో అదనంగా ఎమ్మెల్యే నిధులు కేటాయిస్తామని ప్రకటించినా అచరణలోకి రాలేదు. ఈ పరిస్థితుల్లో పెండింగ్ బిల్లులు పొందడం కోసం సర్పంచులు అందోళన బాట పట్టే అవకాశం కనిపిస్తోంది.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

కోనరావుపేట, ఫిబ్రవరి 1: కోనరావుపేట మండలం ధర్మారం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి ప్లేట్లను గురువారం అందజేశారు. ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివిన 2004 పూర్వ విద్యార్థులు 80 మంది విద్యార్థులకు ప్లేట్ లను అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆసరి రాజు, దడిగే గంగయ్య, శ్రీనివాస్, ధూంపేట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల తీరు సరికాదు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 1: ఇటీవల సిరిసిల్ల నియోజకవర్గ పర్యటనలో భాగంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానించేందుకు భారీ సంఖ్యలో ప్రజాప్రతినిధులు, నాయకులు వేదిక వద్దకు చేరడంతో వారిని అదుపు చేసేందుకు ప్రయత్నించిన మంత్రి పొన్నం వీడియోను బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో వైరల్ చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి గురువారం ఎల్లారెడ్డిపేటలో ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు పని గట్టుకుని మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఆరోపణలు చేయడం తగదని అన్నారు.

పంచాయతీ పాలకవర్గాలకు సన్మానాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 1: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామపంచాయతీ పాలకవర్గాలకు గురువారం సన్మాన కార్యక్రమాలు జరిగాయి. ఐదు సంవత్సరాల్లో గ్రామాల అభివృద్ధిలో పాలకవర్గాలు నిరంతరం శ్రమించాయని, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం నాగారం గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని పంచాయతీ కార్యదర్శి అప్సనా గురువారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ బాస లావణ్య శ్రీనివాస్, పాలకవర్గం ఉన్నారు.

గంభీరావుపేట: మండలంలోని నర్మాల సర్పంచ్ ఎడబోయిన రాజును మాల మహనాడు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మాల మహనాడు అధ్యక్షుడు దోసల చంద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగదండి స్వామి, మండల అధ్యక్షుడు లక్కం బాబు ఉన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 1: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో గ్రంథాలయాన్ని సర్పంచ్ మాట్ల మధు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు, యువకులు గ్రంథాలయానికి ఫర్నీచర్‌ను వితరణగా అందించారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్, ఉపసర్పంచ్ సతీష్ రెడ్డి, కొమ్మిటీ రాజిరెడ్డి, అబ్బడి తిరుపతిరెడ్డి, కందుకూరి గణేష్, కొత్తపల్లి శ్రీనివాస్, గిన నర్సయ్య, బాలసాని పూర్ణచందర్, మోగిలి కరుణాకర్, ఉప్పునుతుల వెంకటేష్ పాల్గొన్నారు.

గ్రామాల రూపురేఖలను మార్చిన సర్పంచ్‌లు

- జడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

చందుర్తి, ఫిబ్రవరి 1: ఉమ్మడి రాష్ట్రం అనంతరం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో సర్పంచులు గ్రామాల రూపురేఖలను మార్చారని జడ్పీచైర్ పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో రైతు వేదిక, పల్లె దావకాన భవనం, సనుగుల గ్రామంలో మన ఊరు మనబడి కార్యక్రమంలో చేపట్టిన డైనింగ్ హాల్, మూడపల్లి గ్రామంలో పల్లె దవాఖానాలు, అంగన్వాడీ కేంద్ర భవనము గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం అనంతరం ఏర్పడిన తెలంగాణలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను సర్పంచులు కష్టపడి పనులు చేపట్టారన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు, రైతు వేదికలను నిర్మాణం చేపట్టారన్నారు. తడిపొడి చెత్త వేర్వేరుగా సేకరించి, గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పనులను చేపట్టారన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం కార్యక్రమాలను చేపట్టి చివరి రోజు వరకు సేవలను అందించడం అభినందనీయమని వారి సేవలను కొనియాడారు. మూడపల్లి గ్రామంలోనే దాదాపు 70 లక్షల పలు అభివృద్ధి పనులను ప్రారంభించుకున్నామన్నారు. ఎంపీపీ బైరగోని లావణ్యారమేష్, జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సర్పంచులు నేతికుంట జలపతి, లింగంపల్లి కరుణాకర్, చిలుక అంజిబాబు, లింగంపల్లి సత్తయ్య, ఎంపిటిసిలు మ్యాకల గణేష్, మాదసు వేణు, ఎంపీడీవో రవీందర్, ఎంఏఓ దుర్గరాజు, ఎంపీఓ ప్రదీప్, అంగన్వాడి సూపర్వైజర్ శంకరమ్మ,నాయకులు ధర్మపురి శ్రీనివాస్, ఎనగంటి శంకర్, అంగన్వాడి టీచర్లు, వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మర్రిగడ్డలో రైతు వేదికను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ

● వేములవాడ టౌన్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ నాయకత్వంలో గత ప్రభుత్వం పనిచేసిందని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామంలో హెల్త్ సబ్‌సెంటర్‌ను ప్రారంభించి, ఫంక్షన్‌హాల్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాదుడూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతీ ఇంటికి ఏదో ఒక రూపకంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయని అన్నారు. అసరా పెన్షన్లు, పేదింటి అడబిడ్డల పెండ్లికు కల్యాణలక్ష్మీ పథకాలతో పాటు రైతుబంధు, రైతు బీమా పథకాలు ఎంతో బాసటగా నిలిచాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బూర వజ్రవ్వబాబు, జడ్పీటీసీ మ్యాకల రవి, స్థానిక సర్పంచ్ కొండపల్లి వెంకటరమణరావు, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు, వైస్ ఎంపీపీ ఆర్‌సీ రావు, ఎంపీటీసీ బాస శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ప్రీమియం క్రికెట్ లీగ్ విజేత డీజీ బ్రేవ్ సోల్జర్స్

- బహుమతులు అందజేసిన ఎస్పీ అఖిల్ మహాజన్



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 1: మూడు రోజుల పాటు హోరాహోరీగా సాగిన సిరిసిల్ల పోలీస్ ప్రీమియం క్రికెట్ లీగ్ మ్యాచ్‌లలో డీజీ బ్రేవ్ సోల్జర్స్ విజేతగా నిలిచింది. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లు, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ పోలీసుల కలిసి ఎనిమిది జట్లుగా ఏర్పడ్డారు. గురువారం సిరిసిల్ల జూనియర్ కళాశాల మైదానంలో డిజి బ్రేవ్ సోల్జర్స్, సిరిసిల్ల స్ట్రైకర్స్‌కి మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఆసక్తికరంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో డీజీ బ్రేవ్ సోల్జర్, సిరిసిల్ల స్ట్రైకర్ జట్లు ఒక్కొక్కరు నిర్ణీత 12ఓవర్లలో 74పరుగులు చేయగా డ్రా అయింది. దీంతో సూపర్ ఓవర్‌లో ఇరుజట్లు మళ్లీ ఆరు బంతుల్లో 14 పరుగులు సాధించి మళ్లీ డ్రాగా నిలిచాయి. దీంతో ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎస్పీ ఉదయ్‌రెడ్డిలు టాస్ వేయగా డిజి బ్రేవ్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ఎస్పీ అఖిల్ మహాజన్ బహుమతులు, మెమోంటోలు, షీల్డ్‌లు ప్రదానం చేసి క్రీడాకారులను అభినందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటములు సహజం అన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం అలవడుతుందన్నారు. సమయం దొరికినప్పుడల్లా సిబ్బంది, అధికారులు వ్యాయామం చేయాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

త్వరలో సిరిసిల్ల పోలీస్ ప్రీమియం లీగల్ సీజన్-01 నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐలు రఘుపతి, అనిల్‌కుమార్, శశిధర్‌రెడ్డి, ఆర్ఐలు మధుకర్, యాదగిరి, రమేశ్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ పాలకవర్గం కాలయాపనతో నిధులు వెనక్కి



మాట్లాడుతున్న కాంగ్రెస్ మహిళా బాధ్యులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 1: మున్సిపల్ పాలకవర్గం కాలయాపన చేయడం వల్లే నిధులు వెనక్కి వెళ్లాయని కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనితనళినీకాంత్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం సిరిసిల్ల మున్సిపల్‌కు రూ. 40 కోట్లు మంజూరు చేయగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 40 కోట్లు నిధులను ఆపాలని ప్రయత్నిస్తోందని సిరిసిల్ల మున్సిపల్ పాలక వర్గం విమర్శలను ఖండిస్తున్నామని అన్నారు. రూ. 40 కోట్లు నిధులు 2023 జూన్‌లో విడదలైతే ఆరు నెలలైనా ఎందుకు సద్వినియేగం చేసుకోలేదని ప్రశ్నించారు. సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గం వల్లే ఆ నిధులు తిరిగి వెనక్కి వెళ్లాయని ప్రజలకు అర్థం అయిందన్నారు. సెస్‌కు మున్సిపల్ కరెంట్ బకాయి కోటి 58 లక్షలు ఉండడంతో స్ట్రీట్ లైట్స్‌కూడా తీసివేసే పరిస్థితి రావడం పాలకవర్గం వైఫల్యం అన్నారు. కరెంటు బిల్లులు ఇన్ని రోజులు ఎందుకు కట్టలేదో ప్రజలకు సమాధానం ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 60 రోజులలోనే సిరిసిల్లకు ఎస్‌జీఎఫ్ నిధుల కింద కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జీ కేకే మహేందర్ రెడ్డి రూ. 10 కోట్లు మంజూరు చేయించారని అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మడుపు శ్రీదేవి, ఆడెపు చంద్రకళ, కాంగ్రెస్ మహిళ విభాగం పట్టణ ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు రమా దేవి, సరిత, రోజా, స్వప్న, లత, జయ పాల్గొన్నారు.

మంత్రి పొన్నంపై కారుకూతలు మానాలి..

మంత్రి పొన్న ప్రభాకర్‌పై బీఆర్ఎస్ నాయకులు కారుకూతలు మానాలని గురువారం టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, కాంగ్రె పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సిరిసిల్ల పట్టణంలో జరిగిన ఆత్మీయ సన్మానంలో వేదికపై కార్యకర్తలను చనువుతో క్రమశిక్షణలో ఉంచడానికి మంత్రి ప్రయత్నించారని పేర్కొన్నారు.

వైస్ చైర్మన్ పదవి కోసం పోటాపోటీ

- ఈ నెల 12న వేములవాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక - గ్రూపులుగా విడిపోయిన కౌన్సిలర్లు



వేములవాడ పురపాలక సంఘం కార్యాలయం

వేములవాడ, ఫిబ్రవరి 1: వేములవాడ పురపాలక సంఘం ఉపాధ్యక్ష పదవి కోసం ఇద్దరు కౌన్సిలర్ల మధ్య పోటాపోటీ వాతావరణం నెలకొంది. ఇప్పటివరకు వైస్ చైర్మన్‌గా వ్యవహరించిన బీఆర్ఎస్‌కు చెందిన 23వ వార్డు కౌన్సిలర్ మధు రాజేందర్ పార్టీ నాయకత్వం అవలంబించిన విధానంతో తీవ్ర నిరాశకు గురై తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఖాళీ అయిన వైస్‌చైర్మన్ స్థానానికి ఈ నెల 12వ తేదీన ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. మొత్తం 28 మంది సభ్యులు ఉన్న వేములవాడ పురపాలక సంఘం పాలకవర్గంలో 2020లో జరిగిన ఎన్నికలలో బీఆర్ఎస్ తరపున 16 మంది సభ్యులు ఎన్నిక కాగా, బీజేపీ తరపున ఆరుగురు, కాంగ్రెస్ తరపున ఒకరు, ఐదుగురు స్వతంత్రులు గెలుపొందారు. దీంతో చైర్ పర్సన్ పదవితో పాటు వైస్‌చైర్మన్ పదవిని అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ సునాయాసంగా గెలుచుకుంది. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో స్వతంత్రులుగా ఉన్న నలుగురు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపగా ఒకరు బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ కు చెందిన 14వ వార్డు కౌన్సిలర్ బింగి మహేష్ శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా 17వార్డు స్వతంత్ర కౌన్సిలర్ వంగల దివ్య సైతం కాంగ్రెస్ లో చేరారు. బీజేపీకి చెందిన 26వ వార్డు కౌన్సిలర్ ముప్పిడి సునంద బీఆర్ఎస్‌లో చేరగా 12వ వార్డు కౌన్సిలర్ రామతీర్థపు కృష్ణవేణి సైతం బీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు తాజాగా 15వ వార్డు కౌన్సిలర్ తిరుమల్‌రెడ్డి కవిత బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో వేములవాడ పురపాలక సంఘం పాలకవర్గం కౌన్సిలర్లలో వివిధ పార్టీల బలాబలాలు అనూహ్య రీతిలో మారిపోయాయి. వైస్ చైర్మన్ పదవికి ఎన్నిక అనివార్యంగా మారిన తరుణంలో నాలుగో వార్డు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న యువ నాయకుడు మారం కుమార్ ఆ పదవిని ఆశిస్తూ అందుకు అనుగుణంగా కౌన్సిలర్ల మద్దతు కూడగట్టడంలో నిమగ్నమయ్యారు. సాంకేతికంగా బీఆర్ఎస్ పార్టీకి 16 మంది సభ్యులు ఉన్నప్పటికీ ఇందులో ఒకరు కాంగ్రెస్‌లో చేరడం మరో ఇద్దరు, ముగ్గురు ఆ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇచ్చేందుకు విముఖత చూపడం వల్ల కొంత అనిశ్చితి నెలకొంది. స్వతంత్ర సభ్యుల నుంచి సైతం ఒకరు బీఆర్ఎస్‌కు దూరం కావడం మధ్యలో కొంతకాలం బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్న ఒక సభ్యురాలు పార్టీకి దూరంగా ఉండటంతో గెలుపు కోసం అవసరమైన సంఖ్యను చేరుకునేందు కు బీఆర్ఎస్ నాయకులు శ్రమిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో వైస్ చైర్మన్ రేసులో ఉన్నానని చెప్పుకుంటున్న 14వ వార్డు కౌన్సిలర్ బింగి మహేష్ తన సామాజిక వర్గానికి చెందిన కొందరు కౌన్సిలర్లు తన దగ్గర బంధువులపై ఆశలు పెట్టుకుని పోటీకి దిగుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీకి చెందిన సభ్యులు సైతం మహేష్‌కు మద్దతు ఇస్తామని తొలుత చెప్పినప్పటి కీ బీజేపీలోని ఆరుగురు సభ్యుల నుంచి ప్రస్తుతం ముగ్గురు మాత్రమే మిగలడంతో బింగి మహేష్ డైలామాలో పడిపోయారు.



మారం కుమార్



బింగి మహేష్

● వైస్ చైర్మన్ స్థానంపై అగ్రనేతల దృష్టి..

వేములవాడ పురపాలక సంఘం వైస్‌చైర్మన్ స్థానం దక్కించుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన అగ్రనేతలు దృష్టి సారించారు. వేములవాడ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తన అనుచరుడు బింగి మహేష్‌ను మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా గెలిపించుకునేందుకు రంగంలోకి దిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఆయన ఇప్పటికే పలువురు కౌన్సిలర్లతో ఫోన్ ద్వారా చర్చించి మద్దతు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. మరోవైపు తమ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఇప్పటికే తమ పార్టీకి చెందిన కౌన్సిలర్లు మద్దతుగా నిలుస్తున్న కౌన్సిలర్లతో చర్చలు జరిపి ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉండవద్దని పూర్తి అప్రమత్తతో వ్యవహరించి గెలిచి తీరాలని దిశానిర్దేశం చేశారు. వేములవాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ స్థానం కోసం ఎన్నిక పోటాపోటీగా జరగనున్న నేపథ్యంలో భారీఎత్తున డబ్బు చేతులు మారుతున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఓ అభ్యర్థి ఇప్పటికే ఒక్కో కౌన్సిలర్‌కు లక్ష రూపాయల నజరానా ఆఫర్ చేసి అందులో సగం ముట్ట చెప్పినట్లు తెలుస్తుండగా మరో అభ్యర్థి తనకు మద్దతు ఇస్తే మరింత ఎక్కువ ప్యాకేజీ ఇస్తానని ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం. దీంతో అన్ని పార్టీలకు చెందిన కౌన్సిలర్లు స్వతంత్రులు ఎప్పుడు ఎటువైపు ఉంటారో తెలియని సందిగ్ధ పరిస్థితి నెలకొంది. పరిస్థితులలో స్పష్టతలేని పక్షంలో క్యాంపులకు వెళ్లాలని ఇరువురు అభ్యర్థులు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

సమ్మె నోటీసులు అందజేత



కలెక్టరేట్ ఏవోకు సమ్మె నోటీసులు అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా అన్నికార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, రైతు సంఘాల అధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త సమ్మె-గ్రామీణ బంద్‌లో జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు, స్కీం వర్కర్లు పాల్గొంటారని వారికి సెలవును ప్రకటించాని జిల్లా అల్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌తోపాటు అన్ని జిల్లా అధికారులను కలిసి సమ్మె నోటీస్‌లను గురువారం నాయకులు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జిందం ప్రసాద్, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకులు గాజుల సాగర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ హయాంలో దేశంలో కార్మికులకు ఉపాధి కరువై కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పోరేట్, మతతత్వ నిరంకుశ పాలనను ఎండగట్టడంలో భాగంగానే ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మె-గ్రామీణ బంద్‌ను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లాలో విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు అజ్జ వేణు, మీసం లక్ష్మణ్, ఎలిగేటి రాజశేఖర్, గురజాల శ్రీధర్, నక్క కనుకయ్య, అల్లె బాలరాజు పాల్గొన్నారు.

వెంకట్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 1: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో దివంగత సేవూరి వెంకట్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి గురువారం పంచాయతీ కార్యదర్శి దేవరాజుకు వినతి పత్రం అందజేశారు. సిరిసిల్ల మాజీ సమితి అధ్యక్షుడుగా, మాజీ ఎంపీపీగా, మాజీ సర్పంచ్‌గా పనిచేసిన వెంకట్‌రెడ్డి గ్రామాభివృద్ధికి ఆయన సొంత ఆస్తులను అమ్ముకున్నారని పేర్కొన్నారు. ఆయన వెంట మేగి నర్సయ్య, వడ్నాల భాస్కర్ ఉన్నారు.